సాక్షి
కాకినాడ

శుక్రవారం । 6 । సెప్టెంబర్ । 2024



నిత్యాన్నదానానికి విరాళం

ఐ.పోలవరం: మురమళ్లలోని వీరేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి సీతంరాజు శివరామకృష్ణ దంపతులు (విశాఖపట్నం) గురువారం రూ.50 వేల విరాళం అందజేశారు.



తూర్పుతీర భద్రతపై సమీక్ష

కాకినాడ క్రైం: కోస్ట్‌గార్డు ప్రధాన కార్యాలయంలో హెచ్‌క్యూఎన్‌సీ సీవోఎస్ సమీర్ సక్సేనా అధ్యక్షతన గురువారం సాయంత్రం తూర్పు తీర భద్రతపై సమీక్ష నిర్వహించారు.



14న లోక్ అదాలత్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఈ నెల 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ గంధం సునీత గురువారం తెలిపారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం



భవానీ ప్రియ లక్ష్మీనారాయణ గంగాభవాని

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాలకు చెందిన ముగ్గురిని వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాలకు రాష్ట్ర అధ్యక్షులుగా నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. గాండ్ల, తెలికుల విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన సంకిస భవానీ ప్రియ, అయ్యేరక విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన అవాల లక్ష్మీనారాయణ, పెరిక విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా కాకినాడకు చెందిన పురుషోత్తం గంగాభవాని నియమితులయ్యారు.

జిల్లా రగ్బీ అసోసియేషన్ చైర్మన్‌గా రామన్నరాజు



నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న వియ్యపు రామన్నరాజు

పిఠాపురం: స్థానిక సూర్యరాయ గ్రంథాలయంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రగ్బీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు ఇ.నాగేంద్ర కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఇందులో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రగ్బీ అసోసియేషన్ నూతన చైర్మన్‌గా వియ్యపు రామన్నరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గౌరవ అతిథిగా కొండేపూడి శంకరరావు, ఒలింపిక్ అసోసియేషన్ సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు కె.పద్మనాభం, కె.చిన్నబ్బాయి, ఉపాధ్యక్షుడు కేతవర కృష్ణ, కోశాధికారి బి.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి కూలీ మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న హెచ్‌సీ శ్రీనివాసరావు

గోకవరం: గ్రామ శివారున పామాయిల్ తోటలో కొమ్మలు నరుకుతుండగా విద్యుదాఘాతానికి గురై వ్యవసాయ కూలీ మృతి చెందాడు. హెచ్‌సీ శ్రీనివాసరావు కథనం ప్రకారం.. గండేపల్లి మండలం రామయ్యపాలేనికి చెందిన పచ్చిపాల దుర్గా అరుణ్ కుమార్ (20) గోకవరం శివారున పామాయిల్ తోటలో కొమ్మలు నరకడానికి గురువారం ఉదయం వచ్చాడు. అతను పొడవాటి అల్యూమినియం కత్తితో కొమ్మలు తొలగిస్తుండగా విద్యుత్ తీగలకు తగిలి షాక్‌కు గురై మృతి చెందాడు. అతడి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పోలీసులు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి సోమరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బీ న్యూ షోరూం ప్రారంభం



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న కంపెనీ సీఈఓ సాయి నిఖిలేష్

పిఠాపురం: పట్టణంలో బీ న్యూ మొబైల్స్, ఎలక్ట్రానిక్స్ రెండో షోరూమ్‌ను గురువారం ప్రారంభించారు. కంపెనీ సీఈఓ యర్రగుంట్ల సాయి నిఖిలేష్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ఇది 149వ షోరూమ్ అన్నారు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా వినూత్న మోడళ్లను ఆకర్షణీయమైన ఆఫర్లతో ఆన్‌లైన్ ధరల కంటే తక్కువకు అందిస్తున్నామన్నారు. అధునాతన బ్రాండ్ల స్మార్ట్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, అలాగే మొబైల్ యాక్సెసరీస్ ఆకర్షణీయమైన ధరలలో అందిస్తున్నామన్నారు. బజాజ్, టీవీఎస్ ఫైనాన్స్ ద్వారా కొనుగోలు చేసే వారికి ఎంపిక చేసిన మోడళ్లపై జీరో డౌన్ పేమెంట్ సౌకర్యం ఉందన్నారు. నూతన షోరూం ప్రారంభం సందర్భంగా వినియోగదారులకు డోర్ డెలివరీ సౌకర్యం కల్పించామని, హెల్ప్‌లైన్ 04048491111 ను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు.



కరప గురుకుల పాఠశాలలో తరగతి గదిలోనే నేలమీద పడుకున్న విద్యార్థులు



రావికంపాడులో బీసీ హాస్టల్‌లో అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు

వసతి అరకొరే..

ఒక్క గదిలో 75 మంది వసతి.. గుక్కెడు నీటి కోసం అవస్థలు.. అపరిశుభ్రత మధ్య చేతిపంపులు.. నాలుగు ముద్దలు తినాలంటే ఇబ్బంది.. శునకాలు, పందులు, దోమలతో సావాసం.. కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న భవనాలతో బెంబేలు.. ఇది కాకినాడ జిల్లాలో గురుకుల పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థుల పరిస్థితి. వాటి పరిస్థితిపై 'సాక్షి' బృందం జరిపిన గ్రౌండ్ రిపోర్టులో అనేక విషయాలు వెలుగు చూశాయి. అక్కడి వసతుల లేమికి అద్దం పట్టాయి.

గ్రౌండ్ రిపోర్ట్ సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

- గురుకుల పాఠశాలలు, వసతిగృహాల్లో సమస్యలు
- విద్యార్థుల వెతలు
- కానరాని వసతులు
- ఆరుబయటే భోజనాలు
- పందులు, దోమలతో సావాసం
- 'సాక్షి' గ్రౌండ్ రిపోర్టులో వెల్లడి

సాక్షి ప్రతినిధి, కాకినాడ: జిల్లాలో గురుకుల పాఠశాలలు, వసతి గృహాలు సమస్యలతో సతమతమవుతున్నాయి. కనీస వసతులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అరకొర వసతులు మధ్య గడుపుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యతో పాటు గురుకులాలు, హాస్టల్ విద్యార్థుల వసతికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చింది. అనేక సంస్కరణలు తీసుకువచ్చి అభివృద్ధి బాట పట్టించింది. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిపై నిర్లక్ష్యం వహిస్తోంది. ఫలితంగా విద్యార్థులు వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- కాకినాడ జగన్నాథపురంలోని ఎస్సీ, ఎస్టీ బాలికల హాస్టల్‌కు ఉన్న రెండు భవనాలు పూర్తిగా పాడైపోవడంతో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మూడు నుంచి పదో తరగతి విద్యార్థుల వసతి గృహాన్ని జగన్నాథపురం బ్రిడ్జి సమీపంలో అద్దె ఇంటిలో నిర్వహిస్తున్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులు ఉండాల్సిన భవనం పూర్తిగా పాడైపోయింది. గతేడాది రిలయన్స్ సామాజిక నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన భవనంలో ఒకే హాలులో 75 మంది విద్యార్థులు ఉంటున్నారు. కొత్త భవనాలను నిర్మించాలని అధికారులను కోరినా పట్టించుకోవడం లేదు.
- కాకినాడ రూరల్ పి.వెంకటాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో సుమారు 609 మంది విద్యనభ్యసిస్తున్నారు. ఐదు నుంచి ఇంటర్మీడియట్ వరకూ ఇక్కడ చదువుకుంటున్నారు. ఇక్కడ విద్యార్థులు తాగునీటి సమస్యతో అష్టకష్టాలు పడుతున్నారు. ఒకప్పుడు కోరమాండల్ యాజమాన్యం ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌తో నీరు శుద్ధికాక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఈ హాస్టల్ గదులు సరిపోక 600 మంది విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న 24 మంది బోధన, బోధనేతర సిబ్బందికి మూడు నెలలుగా జీతాలు అందడం లేదు. చివరకు ప్రిన్సిపాల్‌కు కూడా జీతం సక్రమంగా రాని పరిస్థితి ఉంది. గురుకుల పాఠశాల నిర్వహణకు నెలకు రూ.25 వేలు అవుతున్నా ప్రభుత్వం చెల్లించడం లేదు. గ్యాస్ సిలిండర్ల ఖర్చు సిబ్బంది భరిస్తున్నారు.
- కరప బాలుర గురుకుల పాఠశాలలో అపరిశుభ్రత తాండవిస్తోంది. విద్యార్థులు తరచూ జ్వరాల బారిన పడుతున్నారు. డైనింగ్ టేబుల్ కూడా లేకపోవడంతో నేల మీద కూర్చుని భోజనాలు చేస్తున్నారు.
- కరప మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల (బాలుర) పాఠశాలలోనూ సమస్యలు తాండవిస్తున్నాయి. ఇక్కడ అరకొర వసతులతో విద్యార్థులు సతమతమవుతున్నారు. పారిశుధ్యం పూర్తిగా లోపించింది. డైనింగ్ టేబుల్ లేక విద్యార్థులు నేలపైన, నిలబడి భోజనాలు చేస్తున్నారు. అసలే వర్షాకాలం, ఆపై అపరిశుభ్ర వాతావరణంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది.
- కరప బాలుర గురుకుల పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 480 మంది విద్యార్థులకు.. తరగతి గదుల్లేక 308 మందే ఉంటున్నారు. ఒకే గదిలో రెండు సెక్షన్లు నిర్వహిస్తుండటం, తరగతిలోనే చదువుకోవడం, అక్కడే పడుకోవడం, పక్కనే బట్టలు ఆరబెట్టుకోవడం, టంకు పెట్టెలు, పుస్తకాలు దగ్గరే ఉంచుకునే పరిస్థితి ఉంది. పీహెచ్‌సీ ఆవరణలో నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలకు కనీసం ప్రహరీ కూడా లేక కుక్కలు, పందులు స్వైరవిహారం చేస్తూ విద్యార్థులకు కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి.
- తునిలో ఎస్సీ హాస్టల్ శిథిల భవనం స్థానంలో చేపట్టిన పునర్నిర్మాణ పనులు నిలిచిపోవడం విద్యార్థినులకు శాపంగా మారింది. డి.పోలవరం ఇంటిగ్రేటెడ్ హాస్టల్లో మరుగుదొడ్లు, తాగునీటి ఇబ్బందులు ఉన్నాయి. ఇటీవల కలెక్టర్ షణ్మోహన్ సగిలి పరిశీలించి వెళ్లినా వాటిలో మార్పు రాలేదు.
- తుని మండలం వి.కొత్తూరు, కోటనందూరు మండలం అల్లిపూడిలోని కేజీబీవీ విద్యార్థినులకు అనువుగా తరగతి గదులు లేవు. నిధులు విడుదలకాక అదనపు గదుల నిర్మాణాలు నిలిచిపోయాయి.
- తొండంగి మండలం రావికంపాడు బీసీ హాస్టల్ మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. హాస్టల్‌లోని 35 మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలకృత్యాలకు అవస్థలు ఎదురవుతున్నాయి. హాస్టల్ పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదించామని వార్డెన్ సత్యనారాయణ తెలిపారు.
- ఏలేశ్వరం బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ శాఖ పాఠశాల/కళాశాల అధ్వానంగా దర్శనమిచ్చింది. చేతి పంపు, క్రీడా మైదానం పరిసరాలు దారుణంగా ఉన్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు మొత్తుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. పాఠశాల చుట్టూ తుప్పలు పెరిగిపోయి పాములు సంచరిస్తూండటంతో విద్యార్థినులు భయపడుతున్నారు. పాఠశాలలోని అపరిశుభ్ర పరిస్థితుల నేపథ్యంలో తాజాగా 88 మంది విద్యార్థినులు వాంతులు, విరోచనాలతో తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.
- గోకవరం మండలం భూపతిపాలెం గురుకుల పాఠశాలలో సమస్యలు తిష్టవేశాయి. డార్మెట్రీలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షాకాలం కావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోమల బెడదతో మలేరియా, టైఫాయిడ్‌తో ఆస్పత్రి పాలయ్యారు. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా భోజనశాల లేదు.
- ఇటీవల జగ్గంపేట బాలికల గురుకుల పాఠశాలలో ముగ్గురు జ్వరం బారిన పడ్డారు. పెద్దాపురం రాజీవ్ గృహకల్ప సమీపంలో ఎస్సీ బాలికలు, బీసీ బాలుర, బీసీ బాలికల హాస్టళ్లు ఉండేవి. ఎస్సీ బాలికల హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో దాన్ని మూసి వేశారు. బీసీ బాలుర హాస్టల్ భవనం చుట్టూ మురుగు నీరు నిలిచిపోతోంది. తుప్పలు బాగా పెరిగిపోయాయి. దీంతో హాస్టల్లోని దోమలు, పాములు వస్తున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. హాస్టల్ వద్ద సెప్టిక్ క్లీనింగ్ ట్యాంకు పార్కింగ్ చేసి ఉండటంతో దుర్వాసన భరించలేకున్నారు.
- పెద్దాపురంలో బీసీ బాలికల, బాలుర, ఎస్సీ బాలిక, బాలుర హాస్టళ్ల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో విద్యార్థులకు కంటికి కనుకు ఉండడం లేదు. బీసీ బాలికల వసతి గృహం ప్రహరీ చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి.



కరప గురుకుల పాఠశాలలో నేలపై కూర్చుని భోజనం చేస్తున్న విద్యార్థులు, పక్కనే తిష్టవేసిన కుక్కలు



కాకినాడలో పూర్తిగా పాడైపోయి నిరుపయోగంగా వసతి గృహ భవనం

వసతులు లేక ఇబ్బంది



గురుకుల పాఠశాలలో వసతులు లేక చాలా ఇబ్బంది పడుతున్నాం. తరగతి గదిలో పుస్తకాల పెట్టెలు, దుస్తులు ఉంచుకుంటున్నాం. అదే గదిలో నేలపైన పడుకోవాల్సి వస్తోంది. గోడకు తాడు కట్టుకుని బట్టలు ఆరబెట్టుకుంటున్నాం. దోమల బాధ ఎక్కువగా ఉంది. దోమతెరలు లేక నిద్రపట్టడం లేదు. పడుకోవడానికి, తరగతికి వేర్వేరు గదులు ఏర్పాటు చేయాలి.

– కేవీఎస్ఆర్ గణేష్ కుమార్, 9వ తరగతి, కరప గురుకుల పాఠశాల

శిథిల భవనంతో భయం



హాస్టల్ భవనం శిథిలమైపోవడంతో భయంతో ఉంటున్నాం. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. కాలకృత్యాలు తీర్చుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం మా ఇబ్బందులను గుర్తించాలి. హాస్టల్ భవనం నిర్మించి, వసతులు పెంచాలి. రావికంపాడు జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి చదువుకుంటూ బీసీ హాస్టల్లో ఉంటున్నాను. మా హాస్టల్‌ను ఆధునికరించాలి.

– సీహెచ్ రమేష్, పదో తరగతి, బీసీ హాస్టల్, రావికంపాడు



సామర్లకోట బీసీ బాలికల హాస్టల్ వద్ద పెరిగిన తుప్పలు, అక్కడే పార్కింగ్ చేసిన సెప్టిక్ క్లీనింగ్ ట్యాంకు

సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయులు కీలకం

- ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్
- ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న ఎంపీ శ్రీనివాస్, చిత్రంలో కలెక్టర్ షణ్మోహన్, డీఈఓ రమేష్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది, సమాజాభివృద్ధికి కృషి చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అన్నారు. కాకినాడ జేఎన్‌టీయూ అల్యూమినియం ఆడిటోరియంలో గురువారం జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, కలెక్టర్ షణ్మోహన్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ హాజరై ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సమాజంలో నాగరికతకు మూల కారణం ఉపాధ్యాయులని, తమ బోధనతో ఎంతో మంది జీవితాల్లో మార్పు తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు.

ఉపాధ్యాయులకు ఎంతో గుర్తింపు

కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయులకు ఎంతో గుర్తింపు ఉందన్నారు. తన తల్లిదండ్రులిద్దరూ ఉపాధ్యాయులేనని తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ జిల్లాలో 70 మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశామన్నారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ విద్యతోనే వ్యక్తికి సమాజంలో గౌరవం, మంచి గుర్తింపు వస్తుందన్నారు. తమ దగ్గర ఉన్న జ్ఞానాన్ని పది మంది విద్యార్థులకు పంచుతూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న గురువులందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ మాట్లాడుతూ సుస్థిర భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులను శక్తివంతం చేయడం అనే ముఖ్య ఉద్దేశంతో 2024 ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ అధికారి ఏ.విజయశాంతి, సమాచార పౌరసంబంధాలశాఖ డీడీ డి.నాగార్జున, జేఎన్టీయూ అధ్యాపకులు, డీవైఈవోలు, ఎంఈవోలు, ఉపాధ్యాయ యూనియన్ల, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విజిబుల్ పోలీసింగ్ పెంచాలి

పిఠాపురం: విజిబుల్ పోలీసింగ్ పెంచాలని సిబ్బందికి ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. ఆయన గురువారం పిఠాపురం రూరల్ పోలీస్ స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, రాత్రిపూట గస్తీ నిర్వహించాలని, ప్రాపర్టీ నేరాలు అరికట్టాలని, వినాయక నిమజ్జనాల ఊరేగింపులో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌లో పట్టాలు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తిని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. గురువారం తెల్లవారు జామున ముంబయి– ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ మూడో నెంబర్ ప్లాట్‌ఫారం వద్ద పట్టాలు దాటుతున్న వ్యక్తిని ఢీకొంది. మృతుడి వయసు 45 ఏళ్లు ఉంటుంది. 5.2 ఎత్తు ఉండి, నల్లని జుట్టు, తెల్లని గెడ్డంతో నలుపు, నీలం రంగు ఫుల్ హ్యాండ్స్ షర్టు, గ్రీన్ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పెద్దాపురం ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. కేసు నమోదు చేసి ఎస్సై బి.లోవరాజు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు ఎస్సై 94406 27562కు సమాచారం ఇవ్వాలన్నారు.

వేలం వాయిదా

తుని రూరల్: లోవ దేవస్థానంలో వివిధ హక్కులకు కోసం గురువారం నిర్వహించిన టెండర్ కం బహిరంగ వేలంలో ఆశించిన స్థాయిలో ఆదాయం లభించకపోవడంతో వాయిదా వేసినట్టు ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. రెండేళ్ల పాటు టోల్‌గేటు నిర్వహణ, రాజుపేటలోని 71 సెంట్ల భూమిని 11 ఏళ్ల లీజుకు ఇవ్వడానికి ఈ వేలం నిర్వహించారు. అయితే ఆశించిన ఆదాయం రాకపోవడంతో వాయిదా వేశారు. అలాగే అమ్మవారికి సమర్పించిన వస్త్రాలు తీసుకుపోయేందుకు వేలం నిర్వహించగా పి.సూరన్న రూ.1.75 లక్షలకు దక్కించుకున్నారు. అన్నవరం దేవస్థానం ఉపకమిషనర్ ఎస్.చంద్రశేఖర్ పర్యవేక్షణలో జరిగిన ఈ వేలంలో అధికారులు పి.సీతా రామాచార్యులు, సీహెచ్.బాబునాయుడు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.3.83 లక్షల విరాళం

అన్నవరం: విజయవాడలోని వరద బాధితులకు అన్నవరం సత్యనారాయణస్వామి దేవస్థానం ఉద్యోగులు తమ ఒక రోజు మూలవేతనం సుమారు రూ.3.83 లక్షలు ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. ముఖ్యమంత్రి సహాయనిధికి సెప్టెంబర్ జీతాల నుంచి ఈ మొత్తాన్ని పంపనున్నారు. దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ ద్వారా దేవదాయ ధర్మదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణకు ఈ మొత్తం అందజేస్తారు. ఈ విషయాన్ని ఎస్టాబ్లిష్‌మెంట్ సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్ గురువారం సాయంత్రం తెలిపారు.